# Eenadu

## Registration section of the airport!

**Date: 20/12/2013 | Edition: Hyderabad | Page: 9 | Source: Bureau | Clip size (cm): W: 20 H: 17**

Clip: 1 of 1


# విమానాశ్రయాల విభాగం నమోదు!

● మాల్దీవులు ప్రభుత్వం ఆహ్వానిస్తే విమానాశ్రయం నిర్వహిస్తాం ☛ జీఎమ్ఆర్ గ్రూపు ఛైర్మన్ జి.ఎం.రావు

ఈనాడు - హైదరాబాద్

జీఎమ్ఆర్ గ్రూపులోని విమానాశ్రయాల విభాగాన్ని స్టాక్ ఎక్ఛేంజీల్లో నమోదు చేసే ఆలోచన ఉందని, అయితే సరైన సమయం కోసం వేచి చూస్తున్నామని జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ జి.ఎమ్.రావు తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ పరిణామాలను గమనిస్తూనే ఉన్నామని, అవకాశం వచ్చినప్పుడు చేస్తామన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ సమావేశ కేంద్రం (హెచ్ఐసీసీ)లో జరుగుతున్న టై ఎంట్రప్రెన్యూరల్ సదస్సు 2013లో గురువారం పాల్గొన్న జి.ఎమ్.రావు, ఆ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మాల్దీవులలోని కొత్త ప్రభుత్వం ఆహ్వానిస్తే మాలె విమానాశ్రయాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు జి.ఎమ్.రావు తెలిపారు. మాలె విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, 25 ఏళ్ల పాటు నిర్వహించేందుకు ముందుగా అనుమతి ఇచ్చిన అక్కడి ప్రభుత్వం, తప్పుడు కారణాలతో రద్దు చేసినందున 1.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8,540 కోట్లు) పరిహారాన్ని కోరుతూ మధ్యవర్తిత్వ పిటిషన్‌ను వేసినట్లు ఆయన గుర్తు చేశారు. అక్కడి ప్రభుత్వం ఆహ్వానిస్తే, నిర్వహణ బాధ్యతను స్వీకరిస్తామన్నారు.

**'ఇస్తాంబుల్'లో వాటా విక్రయించం:** ఇస్తాంబుల్‌లోని సబీహా గోక్‌చన్ విమానాశ్రయంలో తమకున్న వాటాను విక్రయించబోమని జి.ఎమ్.రావు అన్నారు. పోర్ట్‌పోలియో మేనేజ్‌మెంట్ వ్యూహాలను రచిస్తున్నామే తప్ప ఆ విమానాశ్రయంలో వాటా విక్రయించడంలేదని పేర్కొన్నారు. 'పోర్ట్‌పోలియో మేనేజ్‌మెంట్ అనేది ఒక వ్యూహం. అభివృద్ధి కోసం గ్లోబల్ కంపెనీలన్నీ ఇదే విధానాన్ని పాటిస్తున్నాయి, మేము కూడా ఈ పద్ధతిని కొనసాగిస్తామ'ని వివరించారు. ఇస్తాంబుల్ విమానాశ్రయంలో లిమాక్ హోల్డింగ్స్‌కు 40 శాతం, జీఎమ్ఆర్ గ్రూపునకు 40%, మలేషియన్ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్‌కు 20% వాటా ఉన్నాయి. జీఎమ్ఆర్ గ్రూపు రుణ భారం దాదాపు రూ.40,000 కోట్లకు చేరినట్లు




గురువారం హెచ్ఐసీసీలో టై సదస్సులో మైహోమ్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, శ్రీని రాజు, జీఎమ్ఆర్ గ్రూప్ ఛైర్మన్ జి.ఎమ్.రావు

తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జీఎంరావును ప్రశ్నించినప్పుడు, ఇస్తాంబుల్ విమానాశ్రయంలో వాటా విక్రయానికి సిద్ధపడుతున్నట్లు వచ్చిన వార్తలు వదంతులే అని స్పష్టం చేశారు.

**దీర్ఘకాల దృక్పథం కావాలి:** వ్యాపారం/సంస్థ/పరిశ్రమను కొద్ది కాలం నిర్వహించి సొమ్ము చేసుకుందామనే ధోరణి సరికాదని, దీర్ఘకాల దృక్పథంతోనూ, విలువలతోనూ నిర్వహించాలని టై సదస్సుకు హాజరైన ఔత్సాహికులకు జి.ఎమ్.రావు సూచించారు. ఎదిగే కొద్దీ ఆలోచనా పరిధి విస్తరించాలని వివరించారు. సానుకూల దృక్పథంతో ఉండాలని, కార్యకలాపాల్లో సంక్లిష్టతను విడనాడాలని, ఇతరులతో పోల్చుకోవద్దని సూచించారు. వివిధ పనుల్లో నిమగ్నం కావాల్సి వచ్చినా, అవగాహనతోనే సాగాలని తెలిపారు. కోపం, అసహనం వంటివి తగ్గించుకునేందుకు యోగా, ధ్యానం పాటించాలన్నారు. కొనసాగుతున్న రంగంలో కన్నా మరో రంగంలో ఎదగడానికి అవకాశం ఉందని గమనించినప్పుడు, ఆ రంగంలో మెలకువలు తెలుసుకుని అడుగు పెట్టాలని మైహోమ్ గ్రూపు ఛైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు చెప్పారు. హోమియోపతి విద్యను అభ్యసించి, హైదరాబాద్‌లో ప్రాక్టీసు ఆరంభించి కూడా స్నేహితుడి సలహాపై స్థిరాస్తి, నిర్మాణ రంగాల్లోకి ప్రవేశించానని తెలిపారు. ఈ రంగాల్లో విస్తృత అవకాశాలపై అవగాహన వచ్చాక, ఇందులోనే స్థిరపడ్డానని, అనుబంధంగా సిమెంటు పరిశ్రమలు స్థాపించి, 11 రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. శంషాబాద్ వైపు భారీ పట్టణ సదుపాయం నిర్మించబోతున్నామని చెప్పారు. నిజమైన విలువ కన్నా ఊహాగానాల (స్పెక్యులేషన్) ఆధారంగా స్టాక్‌మార్కెట్లు పరుగు దీస్తున్నాయని పెట్టుబడిదారుగా మారిన సాంకేతిక నిపుణుడు శ్రీని రాజు చెప్పారు. సమాజానికి ఉపకరించే సంస్థలను నెలకొల్పితే, డబ్బుతో పాటు మరింత పేరు వస్తుందని చెప్పారు. ఐటీ రంగంలో దేశం ఎంత పేరు గడించినా, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన తొలి 100 విశ్వవిద్యాలయాల్లో ఒక్కటీ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఢిల్లీ విమానాశ్రయ నిర్వహణను మెరుగు పరచి, 129వ స్థానం నుంచి 4వ స్థానానికి చేర్చిన జి.ఎమ్.రావు మంచి విద్యాసంస్థను స్థాపించి, ఈ కొరత తీర్చాలని ఆయన కోరారు.